


## లక్ష బిల్వార్చన

నకరికల్లు: నర్సింగపాడులోని గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామికి శుక్రవారం లక్షబిల్వార్చన నిర్వహించారు. విశేష పూజలు, హోమాలు చేశారు.



## ఆనందీశ్వరునికి అభిషేకాలు

చెరుకుపల్లి: కార్తిక మాసం, మాసశివరాత్రి సందర్భంగా గుళ్ళపల్లిలోని గంగాంబిక సమేత ఆనందీశ్వర స్వామికి శుక్రవారం 108 ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

## త్రికోటేశ్వరునికి రుద్రాభిషేకాలు



నరసరావుపేట రూరల్: మాసశివరాత్రి సందర్భంగా కోటప్ప కొండ త్రికోటేశ్వర స్వామికి శుక్రవారం రుద్రాభిషేకాలు, లక్షబిల్వార్చన చేశారు. పుష్పాలంకరణ సేవ జరిపారు.

## కోర్టు తీర్పు.. కన్నీరే ఓదార్పు!



రిషితేశ్వరి కేసులో నిందితులను శిక్షించాలని కోరుతూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన మహిళలు, విద్యార్థులు (ఫైల్)

కన్నకూతురు శాశ్వతంగా దూరమై తొమ్మిదేళ్లపాటు న్యాయంకోసం ఎదురు చూసిన తల్లిదండ్రులకు చివరికి కన్నీరే మిగిలింది. ర్యాగింగ్ భూతానికి తాను విలవిల్లాడినట్లు డైరీలో రాసుకున్న రిషితేశ్వరి అనంతరం ఆత్మహత్యకు పాల్పడిన ఘటన 2015లో తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. వరంగల్‌కు చెందిన ఎం.రిషితేశ్వరి ఏఎన్‌యూ ఆర్కిటెక్చర్ విద్యార్థిని. ఆమె ఆత్మహత్య కేసును కొట్టి వేస్తూ గుంటూరు కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. దీంతో రిషితేశ్వరి తల్లిదండ్రులు దుర్గాబాయి, మురళీకృష్ణలు కన్నీరుమున్నీరుగా విలపించారు. తమకు న్యాయం జరగలేదని వాపోయారు. కుమార్తె మరణానికి ముందు డైరీలో రాసిన విషయాలే ఆమె ఆత్మహత్యకు కారణాలుగా స్పష్టమైనా నిందితులకు శిక్ష పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



విలపిస్తూ కోర్టు నుంచి బయటకు వస్తున్న రిషితేశ్వరి తల్లిదండ్రులు

### న్యూస్‌రీల్

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



పొన్నూరు: తుపాను నేపథ్యంలో రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పలు రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులలో ధాన్యం సేకరణ తీరును పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. పొలాల్లో ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, తొందరపడి నష్టానికి ధాన్యాన్ని విక్రయించవద్దని రైతులకు సూచించారు. ప్రభుత్వం మద్దతు ధరను అందిస్తుందన్నారు. మండలంలో 10 రైసు మిల్లుల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతోందని, ఇప్పటికి 8 వేల క్వింటాళ్ల వరకు కొనుగోలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ కోమలి పద్మ, తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్, సీఎస్‌డీటీ వెంకట్రావు, ఏడీఏ రామకోటేశ్వరి, ఎంఏఓ దేగల వెంకట్రామయ్య, మిల్లర్లు పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకారంలో క్వారీ బాలకోటేశ్వరస్వామి



చేబ్రోలు: కార్తిక మాసం చివర రోజు కావటంతో చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లోని దేవాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మండల పరిధిలోని వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు. శ్రీరంగపురం గ్రామంలోని మోహనరంగ నాయక స్వామి దేవస్థానంలో మహిళలు గోపూజ చేశారు. సహస్ర దీపాలంకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చేబ్రోలు నాగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు.

## మైనార్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

లక్ష్మీపురం: డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే గుంటూరు ఉమ్మడి జిల్లా మైనారిటీ అభ్యర్థుల నుంచి ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోషన్ జమీర్ శుక్రవారం తెలిపారు. దరఖాస్తులను డిసెంబర్ 12వ తేదీలోగా విజయవాడలోని మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయానికి పంపించాల్సిందిగా తెలిపారు. ఇతర వివరాలకు 0866- 2970567 నంబరులో సంప్రదించాలన్నారు.

## 46,683 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 40,183 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 46,683 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 15,800 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 32,927 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

# తుపాను భయం.. రైతుకు ఖేదం

- రూ.1,360కే ధాన్యం కొనుగోలు చేస్తున్న దళారులు
- తుపాను సాకుతో అడ్డగోలుగా దోపిడీ
- యంత్రాలతో వరి కోతకు ప్రాధాన్యం ఇస్తున్న రైతులు
- నామమాత్రంగానే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల పనితీరు

రైతుల భయాన్ని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. తుపాను కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. గిట్టుబాటు ధర కన్నా రూ.400 తగ్గించి దళారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా వారి దగ్గర గోనె సంచులు తెప్పించడంలోనే చాలా జాప్యం జరుగుతోంది. విధిలేక రైతులు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, గుంటూరు : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయాలు జరిపి ప్రతి రైతుకూ మద్దతు ధర వచ్చేలా చేయడంతోపాటు దళారుల పాత్రను పూర్తిగా నిర్మూలించగలిగారు. అయితే అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రైతు నచ్చిన మిల్లుకు ధాన్యం అమ్ముకోవచ్చని, 60 శాతం దిగుబడి మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నిబంధనలు విధించడంతో దళారుల ఆగడాలు తారస్థాయికి చేరాయి. జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లోని వ్యాపారులు ఇక్కడకు వచ్చి పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో ధాన్యం మద్దతు ధర (75 కిలోల బస్తా) రూ.1,725 ఉన్నా... రైతులకు దళారులు మాత్రం రూ.1,300 నుంచి రూ.1,360 వరకే ఇస్తున్నారు.

కోతలు ఎక్కువగా ఉన్న తెనాలి, కొల్లిపర మండలాల్లో గురువారం వరకూ బయట వ్యాపారులు బస్తా రూ.1,400 నుంచి రూ.1430 వరకు చొప్పున కొనుగోలు చేశారు. ఒక్క రోజులోనే ధర రూ.వంద వరకూ తగ్గించేశారు. రైతుల ఆందోళనే వారికి పెట్టుబడిగా మారింది.

**దక్కని 'మద్దతు'**

గుంటూరు జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఈ నెల మొదటి వారంలో ప్రారంభమై ప్రస్తుతం వేగంగా సాగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రెండు సార్లు అధిక వర్షాలతో సుమారు 40 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. దీంతో పాటు దిగుబడిపైనా తీవ్ర ప్రభావం చూపింది. కష్టనష్టాల నడుమ ఖరీఫ్ సీజన్ దిగుబడులు సాధించినా.. మద్దతు ధర మాత్రం అన్నదాతకు దక్కడం లేదు. గుంటూరు జిల్లాలో 1.41 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. 4.52 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేశారు.

**తుపాను కలవరం..**

దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను జిల్లా రైతులను కలవరపెడుతోంది. సోమవారం నుంచి ఒక్కసారిగా వాతావరణం మారిపోవడంతో రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందనే హెచ్చరికలు వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అల్పపీడనం, వాయుగుండం హెచ్చరికలతో జిల్లాలో చాలా చోట్ల యంత్రాలతో వరికోతలు కోసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. అలా కోసి ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా ఇళ్లకు చేర్చుకుంటున్నారు. వాతావరణం బాగుంటే రహదారుల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో ధాన్యాన్ని ఆరబోస్తున్నారు.

**అయిన కాడికి ధాన్యం విక్రయిస్తున్న అన్నదాతలు**



యంత్రాల ద్వారా కోత దృశ్యం



బస్తాలకు ధాన్యం ఎత్తుతున్న రైతులు

**నిబంధనలే అడ్డంకి**



గ్రామంలో మూడు ఎకరాలు మాగాణి భూమి కౌలు తీసుకొని వరి సాగు చేస్తున్నా. పంట కోతకు వచ్చింది. వాతావరణ శాఖ హెచ్చరించడం, రెండు రోజుల నుంచి మబ్బులు పట్టడంతో రెండు ఎకరాలలో మిషన్ ద్వారా కోయించాను. ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి వెళ్లి విక్రయించాలంటే రెండు,మూడు రోజులు ఆరబెట్టాలని చెబుతున్నారు. వాతావరణం సరిగా లేకపోవడంతో ఖర్చుల కోసం ఎకరంలో ధాన్యం రూ.1400కే అమ్మాల్సి వచ్చింది. వాతావరణం ఇంకా రెండు రోజులు ఇలాగే ఉంటే మిగిలిన ధాన్యం కూడా బయట వ్యాపారులకు విక్రయించక తప్పదు.

– జిలుగు భీష్మ, దావులూరు గ్రామం, కొల్లిపర మండలం

జిల్లాలో మొత్తం 56 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పది వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టినా ఇప్పటి వరకూ వెయ్యి మెట్రిక్ టన్నులే కొన్నారు. 24 గంటల్లోనే రైతుల ఖాతాలలో నగదు జమ అవుతున్నా... అసలు కొనుగోలు ప్రక్రియలోనే తీవ్ర జాప్యం జరుగుతోంది. వివిధ ఇబ్బందుల వల్ల రైతులు తక్కువ ధరకే విక్రయించాల్సి వస్తోంది. ఏ గ్రేడ్ ధాన్యం కింటాలుకు రూ.2,320గా ప్రకటించినా పాత బియ్యాన్ని కూడా రూ.1700 మించి కొనడం లేదు.

## తరచూ నేరాలకు పాల్పడే వారిపై నిఘా



నగరంపాలెం పీఎస్ సీఐ వీరానాయక్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న జిల్లా ఎస్పీ

నగరంపాలెం: జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లు, సర్కిల్, సబ్ డివిజన్ల పరిధిలో తరచూ నేరాలకు పాల్పడే పది మందితో కూడిన జాబితా తయారు చేసి నిరంతరం వారిపై నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో గత నెలకు సంబంధించి నేర సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. పీఎస్‌ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, దర్యాప్తు తదితరాలపై ఎస్పీ మాట్లాడారు. పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. జాబితాలోని పది మంది చేసే చట్ట వ్యతిరేక కార్యకలాపాలను పూర్తిగా అడ్డుకట్ట వేయాలని చెప్పారు. తీవ్ర నేరాలకు పాల్పడే వారిని కట్టడి చేసే బాధ్యత డీఎస్పీలదేనని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులు తగ్గించాలని అన్నారు. మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసుల్లో అలసత్వం వద్దని సూచించారు. 'మహిళా...మీ కోసం' ద్వారా విద్యాసంస్థల వద్ద పెట్రోలింగ్ చేయాలని చెప్పారు. రాత్రివేళల్లో ప్రయాణించే మహిళల రక్షణకు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు. సఖి (వన్ స్టాప్ సెంటర్ ఫర్ ఉమెన్ ప్రొటెక్షన్) న్యాయవాది విజయలక్ష్మి కూడా మహిళలకు అందిస్తున్న సేవలను వివరించారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కేసుల ఛేదనలో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందికి నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలను జిల్లా ఎస్పీ అందించారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), ఏటీవీ రవిబాబు (శాంతిభద్రతలు), హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలి

- అన్ని విభాగాల అధికారులకు నగర మేయర్ సూచన
- కావటి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం
- రూ.60 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు, పక్కన కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలని, ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం అందించి ఆహ్వానించాలని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అధికారులను సూచించారు. గుంటూరు నగరంలో సుమారు రూ.60 కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు శుక్రవారం మేయర్ చాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్ కావటి మనోహర్‌నాయుడు అధ్యక్షత వహించగా, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఇందులో నగరంలోని ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన 230 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులను స్టాండింగ్ కమిటీ సభ్యులు, నగర పాలక సంస్థ వివిధ విభాగాధిపతులతో చర్చించి, ఆమోదం తెలిపారు. మేయర్ మాట్లాడుతూ.. వార్డుల వారీగా జరిగే అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రొటోకాల్ పాటించడం లేదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. స్థానిక కార్పొరేటర్లకు ముందస్తు సమాచారం అందించి ఆహ్వానించాలన్నారు. నగరంలో కులమత పార్టీలకతీతంగా ప్రధానంగా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నగర పాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లలో లీజులు పూర్తయిన షాపులకు నిబంధనల మేరకు లీజు రెన్యువల్ చేశామన్నారు. నగరంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పరిశీలనలో గుర్తించిన సమస్యల పరిష్కారంలో భాగంగా డివిజన్ల వారీగా ప్రాధాన్యత క్రమంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణాలకు ఆమోదం తెలిపామన్నారు. విలీన గ్రామాల్లో కూడా నూతనంగా సీసీ డ్రెయిన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రత్యేకంగా ఆమోదం తెలిపామని చెప్పారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు సంకురి శ్రీనివాసరావు, షేక్ మొహమూద్, కాండ్రుకుంట గురవయ్య, మల్లెబోయిన శ్రీవల్లి, పాపతోటి అంబేద్కర్, శ్యామల వెంకట రమణాదేవి, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి. శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాసరావు, వివిధ విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల విజేత నెల్లూరు

- వెనిగండ్లలో ముగిసిన బాలురు అండర్ -17 పోటీలు
- ద్వితీయ స్థానంలో కర్నూలు, తృతీయ స్థానంలో చిత్తూరు
- ఆంధ్రప్రదేశ్ రగ్బీ జట్టును ప్రకటించిన అధికారులు



విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న హెచ్‌ఎం ఎస్. తిరుపతిరావు తదితరులు

పెదకాకాని: క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులు మరిన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ తిరుపతిరావు అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు రోజులుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన బాలురు రాష్ట్రస్థాయి అండర్ 17 పోటీలు శుక్రవారం ముగిశాయి. 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. నెల్లూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో కర్నూలు, తృతీయ స్థానంలో చిత్తూరు జట్లు నిలిచాయి. విజేతలకు బహుమతలు అందజేసిన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రగ్బీ జట్టును పర్యవేక్షకుడు పి. నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.మస్తాన్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం రవి, జిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వై శ్రీనివాసరావు, సెక్రటరీ సీహెచ్ కొండయ్య, ఆకుల సత్యన్నారాయణ, బి.గంగాధర్, పి. డేవిడ్‌రాజ్, ఎంఆర్ బేగం, పాఠశాల ఉపాధ్యాయులు శ్యామల వెంకటరెడ్డి, కె.చంటిబాబు, సీహెచ్ ఆంజనేయరెడ్డి, అవుతు ఇంద్రావతి తదితరులు పాల్గొన్నారు.



## పంచకోటీశ్వరా నమో!

బోళా లింగేశ్వరస్వామి దేవస్థానం 18వ వార్షికోత్సవంతోపాటు కార్తిక మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి భక్తులు ఐదు కోట్ల వత్తులతో శివలింగం, ఓం ఆకారంలో దీపారాధన చేశారు. – పిడుగురాళ్ల

## విద్యాశాఖలో భారీగా బదిలీలు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉప విద్యాశాఖాధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి. విజయ రామరాజు గురువారం రాత్రి విడుదల చేసిన ఉత్తర్వుల్లో తెలిపారు. ఇందులో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలువురికి స్థాన చలనం కలిగింది. గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా ఉన్న పి.వెంకటేశ్వరరావును పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ (ఏపీఎస్‌ఈఆర్‌ఎంసీ) అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కె.లావణ్యకు సమగ్రశిక్ష ఎస్పీడీ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా స్థాన చలనం కలిగించగా, ఆమె స్థానంలో ఎస్.శైలజాబాయి నియమితులయ్యారు. నరసరావుపేట డీవైఈవోగా పని చేస్తున్న కె.వేణుగోపాల్‌ను విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ చేయగా, అక్కడ పని చేస్తున్న పీవీ రమణను పల్నాడు డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. సమగ్రశిక్ష ఎస్పీడీ కార్యాలయంలో పని చేస్తున్న పి. శ్రీనివాసరావును బాపట్ల జిల్లా ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా సమన్వయకర్తగా నియమించారు. గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా తిరుపతిలో పని చేస్తున్న పీవీఎస్ లక్ష్మీ నారాయణకు పోస్టింగ్ ఇచ్చారు.

## పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ఔత్సాహికులు పరిశ్రమలు పెట్టేలా అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జరిగిన పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో విధానం అమలు చేయాలన్నారు. దరఖాస్తుల్లో చిన్న లోపాలను అధికారులు సరిచేసి ముందుకు పంపాలన్నారు. ఈ క్రమంలో వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచుకోవాలని సూచించారు. ప్రైం మినిస్టర్ ఎంప్లాయీస్ జనరేషన్ ప్రోగ్రాం కింద రుణాలు మంజూరు చేసి ఎంఎస్ఎంఈలు గ్రౌండ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పరిశ్రమల రాయితీలకు సంబంధించి 16 క్లెయిమ్‌లకు రూ.1.12 కోట్లు మంజూరు చేస్తూ సమావేశం తీర్మానించిందని కలెక్టర్ వివరించారు. కమర్షియల్ టాక్స్ డీసీ బి.హిజ్బా మనోరమ, ఏపీఎస్ఎఫ్‌సీ మేనేజర్ అజిత్, ఏపీపీబీఈఈ ఎండీ నజీనా బేగం, డీఐసీ జీఎం ఎ.జయలక్ష్మి, నాబార్డ్ డీడీఎం జి.శరత్ బాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

వాణిజ్యం

## నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,800 గరిష్టం : రూ. 2,600

మోడల్ ధర రూ. 2,200

## క్లుప్తంగా

### నేడు వలంటీర్ల నిరసన

**గుంటూరు వెస్ట్:** కూటమి ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా శనివారం నిరసన కార్యక్రమంతో పాటు ధర్నా నిర్వహిస్తామని గ్రామ వార్డ్ వలంటీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ హుమయూన్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి స్థానిక జీఎంసీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుంటామన్నారు. అక్కడ ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. ఎన్నికల ముందు ఒక మాట, తర్వాత ఒక మాట చెబుతున్న కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగడతామన్నారు. గ్రామ, వార్డు వలంటీర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

### ఫుల్‌టైం గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాలను పెంచాలి

**గుంటూరు ఎడ్యుకేషన్:** గురుకుల విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఫుల్‌టైం గెస్ట్ ఫ్యాకల్టీ ఉపాధ్యాయుల వేతనాలను పెంచాలని కోరుతూ ఆర్థికశాఖ కార్యదర్శి జానకిని వెలగపూడిలోని సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ గురుకుల విద్యాసంస్థల్లో సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న ఫుల్ టైం గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులు గౌరవ వేతనాన్ని 50 శాతం వరకు పెంచాలని ఎంతో కాలంగా చేస్తున్న వినతుల ఫలితంగా సంబంధిత శాఖ నుంచి ఫైల్‌ను జానకికి అందజేసినట్లు పేర్కొన్నారు. దీనిపై పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

### పెన్షనర్లకు 50 శాతం ఐఆర్ మంజూరు చేయాలి

**కొరిటెపాడు(గుంటూరు):** రాష్ట్రంలోని 4 లక్షల మంది పెన్షనర్లకు 50 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును వినతిపత్రం ద్వారా కోరినట్లు పెన్షన్‌దారుల చర్చా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఈదర వీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించినప్పటికీ కార్యాలయం ఏర్పాటు, సిబ్బంది నియామకం జరగలేదని, నివేదిక ఎప్పటికి వస్తుందో తెలీదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగులు, పెన్షనర్ల ఆగ్రహాన్ని చల్లబరిచేందుకు 50 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని ఆయన కోరారు.

# దేశ కీర్తిని పెంచేందుకు క్రీడలు దోహదం

**గుంటూరు ఎడ్యుకేషన్:** ప్రపంచంలో మన దేశానికి కీర్తిని ఆర్జించి పెట్టేవి క్రీడలేనని బాలానంద కేంద్ర అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. కృష్ణానగర్‌లోని లోటస్ ఆద్య పాఠశాలలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల స్థాయి విద్యార్థుల అండర్–14, 16 జిల్లాస్థాయి త్రో బాల్, కబడ్డీ పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఏడు దశాబ్దాలకు పైగా బాలానంద కేంద్రం తరపున రాష్ట్ర స్థాయి సాంస్కృతిక, క్రీడా పోటీల ద్వారా వేలాది మందిని దేశం, రాష్ట్రం గర్వించదగ్గ పౌరులుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. క్రీడా పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 పాఠశాలల నుంచి తలపడిన జట్లలో అండర్–14 కబడ్డీలో పిడుగురాళ్లలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విన్నర్, గుంటూరులోని ఆద్య పాఠశాల రన్నర్‌గా నిలిచినట్లు తెలిపారు. అండర్–16 విభాగంలో పిడుగురాళ్ల స్కాలర్స్ స్కూల్ విన్నర్, నరసరావుపేటలోని సింధు స్కూల్ రన్నర్‌గా నిలిచినట్లు వివరించారు. అదే విధంగా



విజేతలతో బాలానంద కేంద్ర అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి

త్రో బాల్ అండర్–14 విభాగంలో తాడేపల్లి గుడ్ న్యూస్ స్కూల్, లోటస్ ఆద్య విన్నర్, రన్నర్లుగా నిలిచినట్లు పేర్కొన్నారు. అండర్–16 విన్నర్స్, రన్నర్స్‌గా సెయింట్ జోసెఫ్ పాఠశాల సర్టిఫికెట్స్, ట్రోఫీలు అందుకున్నారు. కార్యక్రమంలో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు జీవీ శివప్రసాద్, బాలానంద కేంద్ర కోశాధికారి జి.సంధ్య శ్రీ., లోటస్ ఆద్య విద్యా సంస్థల డైరెక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ యడ్లపల్లి ఉమాదేవి, ప్రిన్సిపల్ వేణి శ్రీ., పీఈటీ పవన్ చక్రి, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 7న మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశం

**విజయవంతం చేయాలని డీఈవో సూచన**

**గుంటూరు ఎడ్యుకేషన్:** ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబర్ 7వ తేదీన మెగా పేరెంట్స్ – టీచర్స్ సమావేశం జరగనుందని, దానిని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. శుక్రవారం బ్రాడీపేటలోని శ్రీశారదా నికేతన్ ఓరియెంటల్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతోపాటు సమగ్రశిక్ష భవిత కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థులతో సంస్కృతంలో శ్లోకాలను చదివించడంతోపాటు టెన్త్ విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ తీసుకున్నారు. అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన అమలు తీరుతెన్నులను పరిశీలించారు. విద్యార్థినులు అత్యధిక సంఖ్యలో మధ్యాహ్న భోజనం ఆరగించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతోపాటు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంపై ప్రధానోపాధ్యాయురాలు ఉషాకుమారితోపాటు ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల అభివృద్ధికి సహకారాన్ని అందిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ పట్టాభిపురం మాజీ గవర్నర్ నూతలపాటి



విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో రేణుక

వీరప్రకాశరావు, ఎన్నారై కాండ్ర అప్పారావు, లక్ష్మారెడ్డి రూ.50 లక్షల వ్యయంతో తరగతి గదుల నిర్మాణానికి ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. దీంతోపాటు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.2.50 లక్షలతో బెంచీలు, తాగునీటి సదుపాయాన్ని కల్పించిన విషయం గురించి డీఈవో రేణుక తెలుసుకున్నారు. భవిత కేంద్రానికి వెళ్లి చిన్నారుల్లోని ప్రతిభా నైపుణ్యాలను పరిశీలించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన తిలకించి, వారిని అభినందించారు. శారీరక, మానసిక లోపాలు ఉన్నప్పటికీ వాటిని అధిగమించిన తీరును మెచ్చుకున్నారు. ఉపాధ్యాయులను కూడా అభినందించారు.

# సంప్రదాయ ఆహార తయారీ డిజిటలైజేషన్ అవసరం





బిజినెస్ ఎక్స్‌పోలో కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**బిజినెస్ ఎక్స్‌పోలో తెనాలి డబుల్‌హార్స్ జీఎం కృష్ణప్రసాద్**

**తెనాలి:** ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ (ఏపీసీసీఐఎఫ్) ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం ఆరంభమైన బిజినెస్ ఎక్స్‌పో–2024లో తొలిరోజున ఆహార ప్రాసెసింగ్‌పై ప్రత్యేక సదస్సును నిర్వహించారు. డిసెంబరు ఒకటో తేదీ వరకు జరిగే బిజినెస్ ఎక్స్‌పోలో ఆహార పరిశ్రమల నిపుణులు, ఆవిష్కర్తలు, వాటాదారులు పాల్గొంటున్నారు. తొలిరోజున ఎక్స్‌పో దేశం గొప్ప పాకశాస్త్ర వారసత్వాన్ని పరిరక్షించటంలో ఆవిష్కరణ ప్రాముఖ్యతను నొక్కిచెప్పింది. ఆహార పరిశ్రమ రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన తెనాలిలోని డబుల్‌హార్స్ సంస్థ జనరల్ మేనేజర్ పీఎస్‌వీ కృష్ణప్రసాద్ ఈ సదస్సులో కీలకోపన్యాసం చేశారు. 'బ్లెండింగ్ ట్రెడిషన్ విత్ ఇన్నోవేషన్స్– ది సైన్స్ ఆఫ్ ఇండియన్ ట్రెడిషనల్ ఫుడ్స్ ఇన్ మోడర్న్ ఫుడ్ ప్రాసెసింగ్' అంశంపై ఆయన ప్రసంగించారు. సంప్రదాయ ఆహార తయారీ పద్ధతులను డిజిటల్‌గా మార్చాల్సిన ఆవశ్యకతను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆ రకంగా వాటి ప్రామాణికమైన రుచి, పోషక విలువలు, సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు సంరక్షించాలని సూచించారు. ఈ చొరవకు నాయకత్వం వహించటంలో, సాంకేతికతతో సంప్రదాయాన్ని ఏకీకృతం చేయడానికి ఒక స్థిరమైన నమూనా రూపకల్పనలో అమరావతి విద్యాసంస్థలు, పరిశ్రమల పాత్రను ఆయన గుర్తుచేశారు. ప్రసంగం అనంతరం కృష్ణప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

## రాహుకేతు పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు



**పెదకాకాని:** కార్తిక మాస అమావాస్య ఆదివారం సందర్భంగా శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో రాహుకేతు గ్రహ పూజలు జరిపించుకునే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఉప కమిషనరు కె.బి. శ్రీనివాసరావు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని రాహుకేతు పూజ మండపం వద్ద ప్రత్యేక టెంట్లు, క్యూలైన్, తాగునీరు వంటి వసతులు కల్పించినట్లు చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున 4 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు రాహుకేతు పూజ టిక్కెట్లు ఆలయ ప్రధాన కౌంటరులో అందుబాటులో ఉంటాయన్నారు.

# రాజధాని రైతుల సమస్యలు పరిష్కరించండి

**తాడికొండ:** రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ ఆదేశించారు. శుక్రవారం తుళ్ళూరులోని ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు విన్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. భూ వ్యవహారాలు 45, ప్రణాళికా విభాగం 2, భూ సర్వే 1, డెవలప్‌మెంట్ ప్రమోషన్‌లకు సంబంధించి 2 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రీవెన్స్ డేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాస్ నాయక్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ జి.పి. రామకృష్ణన్, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, పలువురు తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



రైతుల సమస్యలు వింటున్న ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్ నవీన్

# రేపు జ్వాలా దీపోత్సవం

**బాపట్ల:** సుందరవల్లి సమేత క్షీర భావనారాయణ స్వామి దేవస్థానంలో ఆదివారం కార్తిక ఐశ్వర్య జ్వాలా దీపోత్సవం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు బి.బాబునాగేంద్రం తెలిపారు. ఆర్యవైశ్య మహాసభలో దీపోత్సవం కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. బాబునాగేంద్రం మాట్లాడుతూ జ్వాలా దీపోత్సవం సాయంత్రం నాలుగు గంటల నుంచి మంగళ వాయిద్యాలు, వేద పారాయణం, శ్రీ శివస్వామి ఆశీస్సులతో ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా జ్వాల తోరణ పూజ, కార్తిక ఐశ్వర్య జ్వాలా దీపోత్సవం, ఉమామహేశ్వరుల పల్లకీ సేవ, శాంతి మంత్రం, ప్రసాద వితరణ జరుగుతుందని వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బెల్లంపల్లి సత్యనారాయణ, సోమరౌతు నాగభూషణం, బెల్లంకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.



## సోషల్ మీడియా కార్యకర్తకు బెయిల్ మంజూరు

**నగరంపాలెం:** సోషల్ మీడియా కార్యకర్తకు జిల్లాలోని కోర్టులో బెయిల్ మంజూరు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ పోస్టులు పెడుతున్నారనే నెపంతో వైజాగ్‌కు చెందిన వైజాగ్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జి.వెంకటేశ్‌పై ఇటీవల పట్టాభిపురం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వెంకటేశ్‌ను శుక్రవారం గుంటూరులోని ఆరో అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు, సీబీసీఐడీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. జడ్జి కె.శృతవింద బెయిల్ మంజూరు చేశారు. వెంకటేశ్ తరపున న్యాయవాది మొండితోక శ్రీనివాసరావు వాదించారు.

# రిషితేశ్వరికి దక్కని న్యాయం

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్**

**లక్ష్మీపురం:** రిషితేశ్వరి కేసు కొట్టి వేస్తూ కోర్టు తీర్పు వెలువరించడం బాధాకరమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇందులో కిరణ్ మాట్లాడుతూ.. ర్యాగింగ్ వేధింపులు తట్టుకోలేక చనిపోయిన విద్యార్థికి న్యాయం చేయకుండా ఇలాంటి తీర్పులు న్యాయస్థానాలు ఇవ్వటం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. తక్షణమే రిషితేశ్వరి కేసులో నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 2015 జూలై 14వ తేదీన ఆర్కిటెక్చర్ చదువుతున్న రిషితేశ్వరి అనే విద్యార్థిని ర్యాగింగ్ వేధింపులు తట్టుకోలేక యూనివర్సిటీ హాస్టల్ గదిలో ఉరి వేసుకొని చనిపోయిందన్నారు. సూసైడ్ నోట్ లో తన ఆత్మహత్యకు కారణం ర్యాగింగ్ అని, తనని సీనియర్ విద్యార్థులు వేధిస్తున్నారని వివరంగా రాసిందన్నారు. ఈ కేసులో ముగ్గురు విద్యార్థులను, అప్పటి ఆర్కిటెక్చర్ కాలేజ్ ప్రిన్సిపల్ బాబురావును నిందితులుగా కేసు నమోదు చేశారని గుర్తుచేశారు. తొమ్మిది సంవత్సరాల నుంచి కేసు విచారణ నడుస్తోందని, కేసు కొట్టి వేస్తూ కోర్టు తీర్పు చెప్పడం రిషితేశ్వరికి అన్యాయం చేసినట్లేనన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, నగర అధ్యక్షుడు యశ్వంత్, సుభాని తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న కిరణ్, సమీర్, యశ్వంత్, సుభాని



# వీఆర్ఏల సమస్యలు పరిష్కరించండి

**నరసరావుపేట టౌన్:** గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఆర్వో మురళిని శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ వీఆర్ఏలకు తెలంగాణ రాష్ట్రం మాదిరి పేస్కేల్ అమలు చేయాలని, అటెండర్, నైట్ వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్ తదితర పోస్టులను వీఆర్ఏల చేత భర్తీ చేయాలన్నారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జిల్లా పరిధిలో రెండు మండలాలలో వీఆర్ఏల వేతనాలకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయ అధికారులు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డ్యూటీ సర్టిఫికెట్లు అడగడం అన్యాయమన్నారు. అలాగే అక్రమ డ్యూటీలు రద్దు చేయాలని, డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట మండల అధ్యక్షులు రోశయ్య, ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ, సత్తెనపల్లి మండల అధ్యక్షులు రవి, ప్రధాన కార్యదర్శి మునాఫ్, రొంపిచర్ల మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్ఓ మురళికు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్ఏ సంఘ ప్రతినిధులు

# ప్రభుత్వ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

**బాపట్ల:** ప్రభుత్వం బీసీలకు అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బాపట్లలోని కలెక్టరేట్‌లో బీసీ రుణాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈడీ మాట్లాడుతూ బీసీల్లోని అన్ని కులాలకు రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లాలో 2,875 మందికి రాయితీలు ఇచ్చేందుకు రూ.47.60 కోట్లు ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. 52 రకాల యూనిట్లు ఏర్పాటు చేసేందుకు రుణాలను మంజూరు చేస్తామని తెలిపారు. రాయితీ రుణాలు పొందేందుకు జనవరి 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, కార్యదర్శి మారం రవికుమార్, బాపట్ల జిల్లాలోని బీసీ సంఘాల కుల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

# కూటమి హామీలపై పోరాటం

**సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్**



**నరసరావుపేట:** ఎన్డీఏ కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుకు పోరాటం చేస్తామని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. వచ్చే నెల 6,7,8 తేదీలలో నరసరావుపేట పట్టణంలో ప్రకాష్‌నగర్‌లోని షాదీఖానాలో నిర్వహించే పార్టీ 25వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా మహాసభల ప్రారంభ సూచికగా ఆరో తేదీన సత్తెనపల్లి రోడ్డులోని కోట సెంటర్ నుంచి పల్నాడు బస్టాండ్ వరకు ప్రదర్శన అనంతరం బహిరంగసభను జయప్రదం చేయాలన్నారు. ప్రధాన వక్తలుగా పార్టీ రాష్ట్ర పూర్వ కార్యదర్శి కామ్రేడ్ పెనుమల్లి మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ చిగురుపాటి బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారని వివరించారు.

## ఆకట్టుకున్న 'సన్‌రైజింగ్ ఆంధ్రప్రదేశ్'





అంతర్జాతీయ సైకత శిల్పి బాలాజీ వరప్రసాద్ ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణం సీతానగరం కృష్ణానది ఇసుక తిన్నెల్లో శుక్రవారం 'సన్‌రైజింగ్ ఆంధ్రప్రదేశ్'పై సైకత శిల్పం తీర్చిదిద్దారు. ఒడిశా ప్రభుత్వం నిర్వహించే శాండ్ ఆర్ట్ పోటీల్లో మూడు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ నుంచి బాలాజీ వరప్రసాద్ ప్రథమ స్థానం సాధించి హ్యాట్రిక్ విజేతగా నిలిచారు. కృష్ణానది తీరంలో సైకత శిల్పంతో విద్యార్థులకు శాండ్ ఆర్ట్‌పై అవగాహన కల్పించారు. –తాడేపల్లి రూరల్

# ఆరోగ్యమే మహాభాగ్యం

**జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మురళీగంగాధర్‌రావు**

**పిడుగురాళ్ల:** ప్రతి మనిషి ఆరోగ్యమే మహాభాగ్యమని పిడుగురాళ్ల మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం. మురళీ గంగాధర్‌రావు చెప్పారు. పిడుగురాళ్ల పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కుమారస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం. మురళీగంగాధర్‌రావు హాజరయ్యారు. ముందుగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా షుగర్, బీపీ టెస్టులు నిర్వహించటం ఆనందమన్నారు. కార్యక్రమంలో మెడికల్ హెల్త్ అసిస్టెంట్ సాయిబాబా, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి, సెక్రటరీ వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ మెంబర్లు కోటేశ్వరరావు, అచ్చారావు, ఎం. వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, జాకబ్, సాగర్, రామకృష్ణ, ఉడతా కోటేశ్వరరావు, పలువురు న్యాయవాదులు, మెడికల్ అసిస్టెంట్లు మహ్మద్ నహీమ్, కె. మాదవ్, కె.బషీర్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



జడ్జి మురళీ గంగాధర్‌రావుకు బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

# జామ మొక్కలు పీకేసిన దుండగులు

**నకరికల్లు:** గుర్తుతెలియని దుండగులు జామతోటలోకి ప్రవేశించి రాత్రికి రాత్రే మొక్కలు మొత్తం పీకేశారు. ఈ ఘటన మండలంలోని శివాపురం తండా సమీపంలో శుక్రవారం జరిగింది. నకరికల్లు పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన బాధిత రైతు పేరం వెంకటేశ్వరరెడ్డి కథనం ప్రకారం.. వెంకటేశ్వరరెడ్డి శివాపురంతండా సమీపంలో జామతోటతోపాటు కరివేపాకు, మునగ తదితర పంటలు సాగు చేసుకుంటున్నాడు. రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్న జామతోటలో గురువారం కూలీలతో కలుపు తీయించాడు. తిరిగి శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లే సరికి కాపుదశలో ఉన్న జామతోట మొత్తం పీకేసినట్లు గుర్తించిన రైతు కన్నీరుమున్నీరయ్యాడు. రాత్రికి రాత్రే తోటలోని మొక్కలన్నీ పీకేసిన దుండగులు మొక్కలను కట్టలు కట్టి దూరంగా పడేశారు. దుండగులు చేసిన పనికి తనకు రూ.3లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించాడు.